విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 20, ఆగస్టు 2023

రహదారి భూ సేకరణ క్లైములు క్లియర్ చేయండి

విశాలాంధ్ర - నంద్యాల : ప్రభుత్వం నిర్దేశించిన రెవిన్యూ అంశాలను కాల పరిమితి లోపు పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో, అంకిత భావంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్ని మండలాల తాసిల్దారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో భూసేకరణ, విఓఎల్ఆర్ రీ సర్వే, చుక్కల భూములు, ఓటర్ల జాబితా సవరణ, కోర్టు కేసుల సత్వర పరిష్కారం తదితర రెవిన్యూ అంశాలపై తాసిల్దార్ లతో జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 340సి, 167కె జాతీయ రహదారుల భూములకు సంబంధించి భూ సేకరణ పూర్తయి పెండింగ్లో ఉన్న క్లైమ్ లను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత నివేదికలను ఈనెల 24వ తేదీ లోపు సమర్పించాలని సంబంధిత మండల తహసిల్దార్లను ఆదేశించారు. భూ వివాదాలను పరిష్కరించడమే సమగ్ర సర్వే ప్రధాన లక్ష్యమని, రీసర్వే ప్రక్రియలో నాణ్యత ప్రమాణాలు పాటించి పక్కాగా పకడ్బందీగా చేపట్టాలన్నారు. సమావేశంలో డిఆర్ఓ పుల్లయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కామేశ్వరరావు, వెంకటశివ సంబంధిత డివిజన్, మండలాల ఆర్డీవోలు, తాసీల్దార్లు, సెక్షన్ సూపరింటెండెంట్ లు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఇంటి నిర్మాణాలు పూర్తిచేయండి

విశాలాంధ్ర- నందికొట్కూరు: స్థానిక కొణిదెల రోడ్డులోని జగనన్న కాలనీలను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ అధికారులతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెలాఖరులోగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేయించేందుకు అధికారులు లబ్ధిదారులకు పెండింగ్లో ఉన్న బిల్లులు చెల్లించి ఇంటి నిర్మాణాలు పూర్తి అయ్యే విధంగా లబ్ధిదారులకు దగ్గరుండి చూసుకోవాలన్నారు. జగనన్న కాలనీలలో విద్యుత్, మంచినీటి సౌకర్యం లబ్ధిదారులకు నెల చివరి లోపల ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా నందికొట్కూరు మండలం బిజినవేముల, నందికొట్కూరు మున్సిపాలిటీలోని రెండో సచివాలయంను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో సిబ్బంది హాజరు పట్టిక, ఉద్యోగుల మూవ్మెంట్ రిజిస్టర్, సంక్షేమ పథకాల క్యాలెండర్, ఓటరు వెరిఫికేషన్, జీ ఈ అర్ వెరిఫికేషన్, ఎస్ఎల్‌వి గడువులోగా ప్రజా సమస్యల పరిష్కార చర్యల నివేదిక తదితర రికార్డులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. జీఈఆర్ నమోదులో వందశాతం పురోభివృద్ధి సాధించిన బిజినవేముల వాలంటరీలను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ మాట్లాడుతూ సచివాలయంలో అందుతున్న సర్వీసులను సద్వినియోగం చేసుకునేలా స్థానిక ప్రజలకు అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నత స్థాయి అధికారులు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలికల చదువు సమాజానికి వెలుగు

విశాలాంధ్ర - శిరివెళ్ల : బాలికల చదువు సమాజానికి వెలుగని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి పేర్కొన్నారు. కేజీబీవీ ఎస్ఓ జ్యోతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.సామాజిక సేవాసంస్థ ఆధ్వర్యంలో కస్తూరి బా గాంధీ బాలికల విద్యా వసతి గృహానికి అత్యాధునిక ఇన్వర్టర్‌ను ఎస్పీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో మన చుట్టూ ఏం జరుగుతుందో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సైబర్ నేరాలు, దిశ పోక్సో చట్టాలపై బాలికలు అవగాహన పెంచుకోవాలని సూచించారు.బాలికల చదువు సమాజానికి వెలుగు వంటిదని తల్లిదండ్రులు కష్టపడుతూ తమ చిన్నారులు ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కావాలన్న సదుద్దేశంతో స్త్రీ,పురుష లింగ బేధం లేకుండా బాలికలకు సైతం చదువులు చెప్పిస్తున్నారని గుర్తుశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల విద్యా సంరక్షణపై సంక్షేమ పథకాలు, రక్షణ చట్టాలు ప్రవేశపెట్టినదని వివరించారు. ఒక మంచి విజ్ఞానానికి చరవాణి వాడుతూ ప్రపంచంలో జరిగే విద్య సమాచారాన్ని జనరల్ నాలెడ్జిని అందుపుచ్చుకొని పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ సాధించాలన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి దస్తగిరి, సెవెన్ హిల్స్ ఎండి మారుతి టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వార్డు ఎన్నికల్లో పుంజుకున్న టీడీపీ

విశాలాంధ్ర–ఆళ్లగడ్డ : మండలంలోని కోట కందుకూరు గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి శనివారం జరిగిన ఉప ఎన్నికల్లో వైసీపీ బలపరిచిన అభ్యర్థి నల్లజన లక్ష్మీదేవి తనసమీప టీడీపీ బలపరిచిన అభ్యర్థి ఆర్ల నాగ శ్రీనివాసులు పై 402 ఓట్ల మెజారిటీతో

విజయం సాధించారు. కోట కందుకూరు సర్పంచ్ ఉప ఎన్నికను టీడీపీ , వైసీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. మొదటి రౌండ్ నుండి నాలుగు రౌండ్ల వరకు వైకాపా తన ఆధిక్యాన్ని చూపించింది. రెండవ స్థానంలో తెదేపా, మూడవ స్థానంలో ఎస్ డిపిఐ బలపరిచిన అభ్యర్థులు నిలవడం జరిగింది. ఉత్కంఠ గా జరిగిన ఈ సర్పంచ్ ఉప ఎన్నికల్లో వైకాపా బలపరిచిన అభ్యర్థి నల్లజన లక్ష్మీదేవి (గంప గుర్తు) 402 ఓట్ల మెజారిటీతో విజయం సాధించడంతో వైసీపీ అక్కడ పట్టు నిలుపుకోవడం జరిగింది.

ఎస్.లింగందిన్నె : మండలంలోని ఎస్.లింగందిన్నె వార్డు ఉప ఎన్నికల్లో వైసీపీ తన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. వైసీపీ, టీడీపీ, బిజెపి బలపరిచిన అభ్యర్థులు బండిశేఖర్, బండి వసంతకుమార్, బండివినోద్‌లు బరిలో నిలిచారు చేశారు. దీంతో అక్కడ త్రిముఖ పోటీ జరిగింది. వైసీపీ సర్పంచ్ ఇరిగెల విశ్వనాథరెడ్డి,ఇరిగెల సోదరులు గ్రామంలో తమ పట్టు నిలుపుకునేందుకు ఈ ఉపఎన్నికపై దృష్టి సారించారు. తెలుగు దేశం, వైకాపా మధ్య పోటీ ఉండాల్సి ఉండగా ఎస్ .లింగందిన్నెలో మాత్రం వైసీపీ, బీజేపీల మధ్య పోటీ జరిగింది.

వైసీపీ అభ్యర్థి బండి శేఖర్ 11 ఓట్ల మెజారిటీతో బీజేపీ అభ్యర్థి పై విజయం సాధించారు.

మిడుతూరు : మండల పరిధిలోని అలగనూరు,పైపాలెం గ్రామంలో శనివారం జరిగిన వార్డ్ మెంబర్ ఉప ఎన్నికల పోలింగ్ భారీ పోలీసు బందోబస్తు మధ్య జరిగింది. అలగనూరు గ్రామపంచాయతీ 10వ వార్డుకు జరిగిన ఎన్నికల్లో 103 ఓట్లు పోలు కాగా వైసిపి పార్టీ అభ్యర్థి తాటిపాటి సుధాకర్21 ఓట్లు రాగా తెదేపా పార్టీ అభ్యర్థి పోలగళ్ళ శేషమ్మ కి 78 ఓట్లు వచ్చాయి. నోటాకు ఒక ఓటు ,మూడు చెల్లని ఓట్లుగా పోలయ్యాయి. తాటిపాటి సుధాకర్ పై పోలగళ్ళ శేషమ్మ 57 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అంతేగాక పైపాలెం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఐదో వార్డుకు జరిగిన ఉప ఎన్నికలలో 88 ఓట్ల గాను 78 ఓట్లు పోలు కాగా తెదేపా అభ్యర్థి పిక్కిలి లక్ష్మీదేవికి 35 ఓట్లు వైసీపీ అభ్యర్థి బాల సుబ్బన్న కు 43 ఓట్లు పోలయ్యాయి. పిక్కిలి లక్ష్మీదేవి పై బాలసుబ్బన్న 8 ఓట్ల తేడాతో విజయం సాధించారు. భర్త మరణంతో పోటీ చేసిన పిక్కిలి లక్ష్మీదేవికి సొంత కుటుంబ సభ్యులే సహకరించకపోవడంతో కొంపముంచినట్లు అయిందని

టీడీపీ అభ్యర్థులు గుసగుసలాడుతున్నారు.

కొలిమిగుండ్ల : మండలంలోని బెలుం గ్రామ పంచాయతీలోని 4వ వార్డ్ ఉప ఎన్నికల్లో వైసీపీ మద్దతుదారు అభ్యర్థి కొండ మహేశ్వరి సమీప తెదేపా అభ్యర్థి రాములమ్మ పై 19 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయం నందు4వ వార్డు ఉపఎన్నిక జరగగా వార్డ్ లోని మొత్తం 243 ఓట్ల గాను 199 ఓట్లు పోలయ్యాయి. మహేశ్వరి కి 105 ఓట్లు,రాములమ్మకు 86,చెల్లనివి 6,నోటాకు2 ఓట్లు పడ్డాయి.మహేశ్వరి గెలుపొందినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఎస్ఐ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

చాగలమర్రి : మండలంలోని బ్రాహ్మణపల్లె 5వార్డు ఉప ఎన్నికల్లో ఓబులేసు 59 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. స్థానిక వార్డులో మొత్తం 77ఓట్లు ఉండగా 62ఓట్లు పోల్ కాగా, ఓబులేసుకు 60 ఓట్లు రాగా సమీప అభ్యర్థి స్వర్ణలతకు ఒక ఓటు మాత్రమే వచ్చింది. మరో ఓటు నోటాకు పడింది. దీంతో ఓబులేసు 59 ఓట్ల మెజారిటీతో విజయం సాధించడం

జరిగిందని రిటర్నింగ్ అధికారి రామచంద్రయ్య తెలిపారు. విజయం సాధించిన అభ్యర్థికి ఎన్నికల అధికారులు డిక్లరేషన్ ధ్రువపత్రాలను అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సైరమణయ్య బందోబస్తు ఏర్పాటు చేశారు.

బేతంచెర్ల రూరల్ : మండల పరిధిలోని ఎం.పెండెకల్ మజార గ్రామమైన వెంకటగిరి 10వ వార్డు,రహిమానుపురం 6వ వార్డు స్థానాలకు శనివారం జరిగిన ఎన్నికలలో అధికార పార్టీ వైసీపీ అభ్యర్థులు ఎం వేణుగోపాల్ రెడ్డి 44 ఓట్లతో,బి.ప్రసాద్ లు 58 ఓట్ల మెజారిటీతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారి వెంకటేశ్వర నాయక్ తెలిపారు.

నందికొట్కూరు: మండల పరిధిలో నాగటూరు గ్రామంలో 8 వార్డు కు శనివారం ఎన్నికల పోలింగ్ అధికారి శ్రీనివాసులు, రిటర్నింగ్ అధికారి షేక్షావలి ఆధ్వర్యంలో పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికలో 211 ఓట్లకు గాను 194 ఓట్లు ఫోల్ అయినట్లు పోలింగ్ నిర్వహణ అధికారి శ్రీనివాసులు, రిటర్నింగ్ అధికారి షేక్షావల్లి తెలిపారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే వర్గం తరఫున సగినేల హుస్సేనయ్య, బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి వర్గం తరఫున చెరుకు రత్నమ్మ అభ్యర్థులుగా తలపడగా హోరా హోరిగా జరిగిన ఓట్ల లెక్కింపులో ఆది నుంచే ఎమ్మెల్యే వర్గానికి చెందిన సగినేల హుస్సేనయ్య తన ఆధిపత్యం కొనసాగించారు. చివరగా ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి ఎమ్మెల్యే వర్గానికి చెందిన సగినెల ఉసేనయ్యా 53 ఓట్లతో గెల్లిపొందినట్లు పోలింగ్ అధికారి శ్రీనివాసరావు, రిటర్నింగ్ అధికారి షేక్షావల్లి ప్రకటించారు.

చౌడేశ్వరికి హారం విరాళం

విశాలాంధ్ర - బనగానపల్లె: మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారికి హైదరాబాదుకు చెందిన చిన్న రామయ్య, వెంకటలక్ష్మమ్మ దంపతులు 33 గ్రాములు విలువ గల సుమారు రూ.2.08 లక్షల విలువైన బంగారు లక్ష్మీకాసుల హారం విరాళంగా ఆలయ కార్యనిర్వాణాధికారి రామానుజన్‌కు అందజేశారు. వారికి వేద పండితులు వారికి అమ్మవారి తీర్థ ప్రసాదాలు కుంకుమార్చన నిర్వహించి ఆశీర్వాదం అందజేశారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

విశాలాంధ్ర -రుద్రవరం : మండలంలోని చిన్నకంబలూరు గ్రామ సమీపంలోని వంట పొలాల్లో విద్యుత్తుషాక్ గురై తలారి శేఖర్ (22)అనే యువకుడు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు వివరాల మేరకు గ్రామానికి చెందిన తలారి సూరన్న కుమారుడు శేఖర్ గ్రామ సమీపంలో ఉన్న పొలంలో వరి నారుమడికి నీరు పెట్టేందుకు విద్యుత్ స్టాటరు ను ఆన్ చేస్తుండగా షాక్ గురై మృతి చెందాడన్నారు. ఈ యువకుడు డిగ్రీ చదువుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

వైయస్సార్ బీమా పేద ప్రజలకు ధీమా

విశాలాంధ్ర -బనగానపల్లె: వైయస్సార్ బీమా పేద ప్రజలకు ఆపన్న హస్తమని యాగంటిపల్లె వైసీపీ నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం యాగంటిపల్లెకు చెందిన వెంగన్నగారి నాగలక్ష్మి భర్త రమణ 6 నెలల క్రితం మృతి చెందడంతో ఇంటి పెద్ద కోల్పోవడంతో వైయస్సార్ బీమా లక్ష రూపాయల నగదును శనివారం స్థానిక సచివాలయంలోబ్రహ్మానందరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. నాగలక్ష్మి మాట్లాడుతూ బ్రహ్మానందరెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన మార్కెట్ యార్డ్ చైర్మన్

విశాలాంధ్ర–నందికొట్కూరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఏపీ షాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిల కృషి ఫలితంగా నందికొట్కూరు నూతన మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా షేక్ రహత్ జబ్బర్ శనివారం స్థానిక మార్కెట్ యార్డ్ కార్యాలయంలో డైరెక్టర్లు అయినా జగదీశ్వర్‌రెడ్డి, జలీల్, గఫార్, ఉస్మాన్‌లతో కలిసి యార్డ్ అధికారుల సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నమల్లారెడ్డి, ఐటీ విభాగం జిల్లా అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, ఎంపీపీ మురళి కృష్ణారెడ్డి, ముఖ్య అతిథులుగా హాజరు కావడం జరిగింది. అంతకు ముందు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు.కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మైనార్టీ అధ్యక్షులు అబూబకర్, మండల కన్వీనర్ మన్సూర్, ఓంకార్ రెడ్డి, మహేష్ రెడ్డి, ఉపేంద్రారెడ్డి, సుంకే సుల రాముడు, కౌన్సిలర్లు, నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం

విశాలాంధ్ర- నందికొట్కూరు : స్థానిక ముబారక్ ఫంక్షన్ హాల్ నందు శనివారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బోరెల్లి సుధాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మునిసిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, ఉమ్మడి జిల్లాల మైనార్టీ జోనల్ అధ్యక్షులు అబూబకర్ హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా వారు ఫోటోగ్రాఫర్స్ అందరికీ శుభాకాంక్షలు తెలిపి వారిని సన్మానించారు.

హంద్రీనదిలో పేరుకుపోయిన చెత్త తొలగించాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : హంద్రీలో పేరుకు పోయిన చెత్తను తొలగించాలని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ కోరారు. శనివారం నగరంలోని బుధవారపేట హంద్రీ బ్రిడ్జి వద్ద పేరుకుపోయిన చెత్తను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి వద్ద సేకరిస్తున్న చెత్తను హంద్రీ బ్రిడ్జికి ఇరువైపులా వేస్తున్నారని అయితే ఇక్కడి నుంచి మాత్రం తీసుకెళ్లడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అరకొరగా చెత్తను తీసుకెళుండటంతో హంద్రీలో పూడిక పేరుకుపోయిందన్నారు. తద్వారా హంద్రీ ఎత్తు పెరిగిందన్నారు. దీని వల్ల హంద్రీకి నీరు వస్తే ఈ ప్రాంతాల్లోకి వరద వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఈ చెత్త వల్ల ప్రజలు కంపు వాసనతో అంటు వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. వీధుల్లో చెత్త బాక్సులు పెట్టకపోవడం వల్ల ప్రజలు కాల్వల్లోనే చెత్తను వేస్తున్నారన్నారు. దీంతో కాల్వల్లో నీరు వెళ్లక చెత్తతో నిండిపోయిందన్నారు. అందుకే మున్సిపల్ కమిషనర్ స్పందించి వెంటనే ఈ ప్రాంతాన్ని పరిశీలించి సమస్యను పరిష్కరించాలన్నారు. హంద్రీలో చెత్త పేరుకుపోవడం వల్ల అంటు వ్యాధులతో పాటు వరద వచ్చినపుడు ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించాలని టిజి భరత్ కోరారు. కార్యక్రమంలో కార్పోరేటర్లు పరమేష్, షేక్ జకియా అక్సారి, టీడీపీ నేతలు, నౌషద్, అబ్బాస్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సౌలభ్యం కోసమే భూమిపుత్ర

విశాలాంధ్ర - చిప్పగిరి: మండల కేంద్రమైన చిప్పగిరి లోని మండల రైతుల సౌలభ్యం కొరకే భూమిపుత్ర రైతు ఉత్పత్తి దారుల కంపెనీని స్థాపించడం జరిగిందని కంపెనీ సీఈవో స్వర్ణలత అన్నారు. శనివారం చిప్పగిరి లోనే భూమిపుత్ర రైతు ఉత్పత్తి దారుల లిమిటెడ్ సంస్థను మానిటరింగ్ లో భాగంగా ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో స్వర్ణలత మాట్లాడుతూ నాబార్డ్ వారి సహకారంతో సి ఎస్ ఎస్ పథకం ద్వారా ఎఫర్ట్ సంస్థ మండల కేంద్రమైన చిప్పగిరి గ్రామం తో కలుపుకొని నగర డోనా నేమకల్లు బెల్డోన గ్రామాల రైతులతో భూమిపుత్ర రైతు ఉత్పత్తి దారుల కంపెనీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం కంపెనీ యొక్క ప్రగతిని సమస్త డైరెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కంపెనీ డైరెక్టర్, సర్పంచ్ దాసరి గోవింద రాజులు, ఎఫర్ట్ కోఆర్డినేటర్ భానోదయ, మరియు కంపెనీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

విశాలాంధ్ర- అవుకు : అవుకు పట్టణానికి చెందిన బండికారి రంగమ్మ అనారోగ్యంతో మృతి అవుకు పట్టణ బలిజ సంఘం అధ్యక్షుడు కునుకుంట్ల రామన్న ఆదేశాల మేరకు మండల సంఘం అధ్యక్షుడు కంపిలి నారాయణ పూలమాల వేసి నివాళులర్పించి మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మామిళ్ళ సుబ్బన్న, జక్కా మధు, గుర్రాల రామాంజనేయులు, కృష్ణ కుమార్, నెట్టే కాళ్ల జయరాముడు, హరి ప్రతాప్, మునిమడుగు రంగడు, బుగ్గ రామచంద్రుడు, దాసరి వెంకటేష్, గొడుగు శివ, మిద్దె కరుణాకర్, బుగ్గ నాగార్జున, మునిమడుగు రమేష్, కంపెలి విక్కీ, నగరచంద్ర, దాసరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి కృషి చేయాలి :టీజీ. వెంకటేష్

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : క్రీడాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్తృతంగా కృషి చేయాలని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ వ్యాఖ్యానించారు.శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్ డోర్ స్టేడియంలో 8వ రాష్ట్రస్థాయి ఆఖ్యాపాత్య పోటీలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఆరోగ్యమే మహాభాగ్యం అందుకోసమే విద్యార్థులను క్రీడాకారులుగా రాణించాలని ఆయన కోరారు. క్రీడలు క%శ్రీ%ల లు రెండు కళ్ళ వంటివి అన్నారు. క్రీడాభివృద్ధికి క్రీడా మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సౌకర్యాలను మరమ్మత్తులు చేసి చక్కగా తీర్చిదిద్ది క్రీడాకారులకు అనువుగా మలచాల్సినటువంటి అవసరం ఉంది అన్నారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ కె.జె రెడ్డి మాట్లాడుతూ విస్తరించడం గర్వించదగ్గ విషయమన్నారు. అభివృద్ధికి తమ వంతు సహకరిస్తామన్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి క్రీడలు అవసరమని డాక్టర్ శంకర్ శర్మ న్యాయవాది శ్రీధర్ రెడ్డిలు చెప్పారు.

టీడీపీతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ

విశాలాంధ్ర–వెలుగోడు : శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆదేశాల మేరకు వెలుగోడు మండల గుంతకందాల గ్రామంలో మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ప్రజా చైతన్య యాత్ర చేపట్టి, తెలుగుదేశం పార్టీ భవిష్యత్తు గ్యారెంటీ, ప్రకటించిన మినీ మ్యానిఫెస్టోలోని పథకాలను మహిళలకు వివరించి, ప్రచారం నిర్వహి%శీ% చారు. తెలుగుదేశం పార్టీ మహిళా నేతలు. ప్రచార కార్యదర్శి,మహానంది గంగాదేవి వెంకట లక్ష్మమ్మ, నూర్జహా, నాగలక్ష్మమ్మ, సరోజమ్మ మాట్లాడారు.కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు, అన్నారపు శేషారెడ్డి , ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కలాం, పట్టణ అధ్యక్షులు ఖలీలుల్లా ఖాన్, సీనియర్ నాయకులు హిదాయత్ అలీ ఖాన్, మోమిన్ రసూల్, అబ్దుల్లాపురం భాష హుస్సేన్ సాహెబ్, గుంతకందాల నాయకులురమణ, శ్రీను, గాళ్ళ శివన్న, శంకర్, గోకార్ సాహెబ్, రమణ గౌడ్, మద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం వ్యాపారిపై పీడీ యాక్ట్ నమోదు

విశాలాంధ్ర -బనగానపల్లె : పిడిఎస్ రైస్ వ్యాపారి ముత్తుకూరు శ్రీనివాసులు(డాన్ శీను)జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పీడీ యాక్ట్ నమోదైనట్లు బనగానపల్లె ఎస్సై రామిరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ బనగానపల్లె పట్టణానికి చెందిన ముత్తుకూరు శ్రీనివాసులు(డాన్ శీను)బనగానపల్లె అవుకు, నందివర్గం, నంద్యాల, ఆళ్లగడ్డ ,సంజామల ,గోస్పాడు పోలీస్ స్టేషన్ పరిధిలో పిడిఎఫ్ రైస్ అక్రమ రవాణా మరియు అమ్మకం కేసుల్లో ముద్దాయిగా ఉన్నందున జిల్లా కలెక్టర్, పోలీసు ఉన్నత అధికారుల మేరకు పీడీ యాక్ట్ నమోదు చేసి కడప సెంట్రల్ జైలుకు శుక్రవారం తరలించినట్లు పేర్కొన్నారు.బనగానపల్లె మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

1.20 లక్షల హెక్టార్లలో పంటల సాగు

విశాలాంధ్ర–ఉయ్యాలవాడ: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో నంద్యాల జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 2.38 లక్షల హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 1.20 లక్షల హెక్టార్లలో రైతులు పంటలు సాగు చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రావు తెలిపారు. శనివారం మండలంలో రైతులు సాగు చేసిన పంటల ఈ క్రాప్ నమోదును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు చివరి నాటికి 306 ఎంఎం వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 205 ఎంఎం వర్షపాతం నమోదయిందన్నారు. జిల్లాలో 70 వేల హెక్టార్లలో కేసీ కెనాల్, తెలుగుగంగ, కుందూనది, ఎస్సార్ బీసీల కింద వరి పంట సాగు చేయవలసి ఉండగా ఇప్పటివరకు 13 వేల హెకటార్లల్లో వరి నాట్లు వేశారన్నారు. డ్యాముల్లో సాగునీటి నిలువలు అంతంత మాత్రమే ఉండడంతో రైతులు వర్షాధార పంటలు వేసుకునేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. చిరుధాన్యాలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ చివరి వరకు రైతులు ఖరీఫ్ పంటలు సాగు చేయవచ్చునని, తప్పనిసరిగా ప్రతి పంటను ఈక్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల ఏ డి ఏ లు రామ మోహన్ రెడ్డి, సుధాకర్, మండల వ్యవసాయ అధికారి రాజేంద్ర కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరు సుబ్బరాయుడు సన్నిధిలో..

పాణ్యం-విశాలాంధ్ర : ప్రముఖ శైవక్షేత్రం మండల పరిధిలోని ఎస్.కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానమును ఏపీ అమరావతి సచివాలయం రెవెన్యూ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, కార్యాలయ సిబ్బంది శనివారం సందర్శించి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సురేష్ స్వామి,కిట్టయ్య స్వామి, రోహిత్ స్వామి,ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో ఆమెకు స్వాగతం పలికి అభిషేకం,అర్చనలు,విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఆశీర్వాద మండపంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మి కుమారిని శాలువాతో సన్మానించి,తీర్థ ప్రసాదములు అర్చకులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయభాస్కర్,విఆర్ఓ వీరేష్, సచివాలయం సిబ్బంది వాణి,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైయస్సార్ కళ్యాణమస్తు పేదలకు వరం

విశాలాంధ్ర -మిడుతూరు: పట్టణ , గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైయస్సార్ కళ్యాణమస్తు పథకం పేదలకు ఒక వరమని నాగలూటీ సర్పంచ్ తమిడెల ఉషారాణి తెలిపారు. శనివారం మండల పరిధిలోని నాగలూటి గ్రామ సచివాలయ పరిధిలో ఎంపీడీవో జి.నాగ శేషాచల రెడ్డి, గ్రామ సర్పంచ్ టీ. ఉషా రాణి చేతుల మీదగా వైఎస్సార్ కళ్యాణమస్తు పథకం ద్వారా కురువ సావిత్రి కి రూ: 50,000 లను అందజేశారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ టీ. నాగతులసి రెడ్డి, వైస్ ఎంపీపీ నబిరసూల్, పెద్ద పుల్లారెడ్డి,టి.రాంభూపాల్ రెడ్డి, కరీం,పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీచైతన్య స్కూల్ బస్సు సీజ్..జరిమానా

విశాలాంధ్ర–బేతంచెర్ల రూరల్ : స్థానిక శ్రీచైతన్య స్కూల్ బస్సు అనధికారికంగా తిప్పుతుండడంతో డోన్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్ శనివారం తనిఖీ చేసి రూ.1.05 లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు.శనివారం సాధారణ తనిఖీలలో భాగంగా తనిఖీలు చేస్తుండగా కేఏ 01ఏఎఫ్7016 నంబరు గల బస్సును శ్రీ చైతన్య పాఠశాల వారు,బస్సు కర్ణాటకకు చెందిన టూరిస్ట్ బస్సును తీసుకువచ్చి అనధికారికంగా స్కూలు బస్సుగా మార్చి రోడ్ పర్మిట్, టాక్స్, ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ పర్మిట్ వంటి సరైన ధ్రువపత్రాలు లేకుండా ఉండడంతో బస్సును సీజ్ చేసి రూ. 105,000ల జరిమానా విధించినట్లు వారు తెలిపారు.ఈసందర్భంగా ఆర్టీవో క్రాంతి కుమార్ మాట్లాడుతూ వాహనదారులు ఖచ్చితంగా సరైన ధృవ పత్రాలు కలిగి ఉండాలని, లేనిపక్షంలో భారీ జరిమానా తప్పదని, వాహనదారులు, బస్సులు ఉన్న పాఠశాల యాజమాన్యాలను హెచ్చరించారు.

పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల పట్టణం లీడర్స్ మోడల్ స్కూల్ విద్యార్థి ఏ. మధుతేజ పవర్ లిఫ్టింగ్ పోటీలలో బంగారు పథకం సాధించినట్టు పాఠశాల కరస్పాండెంట్ జె. రవిరాకేష్ జీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ వైజాగ్ లో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీలలో తమ విద్యార్థి మధు తేజ పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్స్ 75 కేజీల పోటీలలో బంగారు పతకం, బెంజ్ ప్రెస్ పోటీలలో కాంస్య పథకము సాధించాడని, మధుతేజ గతంలో కూడా జిల్లాస్థాయి పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీలలో మొదటిస్థానంలో నిలిచారని తెలిపారు. మధుతేజ ను పాఠశాల ప్రిన్సిపల్ దీపాళి, ఉపాధ్యాయ బృందం తోటి విద్యార్థి, విద్యార్థినులు అభినందించారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 20, ఆగస్టు 2023

తక్కువ ధరకే నాణ్యమైన బంగారు ఆభరణాలు

లలిత జ్యువెలరీ చైర్మెన్ కిరణ్‌కుమార్

నూతన షోరూంను ప్రారంభిస్తున్న చైర్మన్ ఎస్.కిరణ్‌కుమార్, మాజీ ఎంపీ టీజీ,వెంకటేష్, ఎంపీ సంజీవకుమార్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: తక్కువ ధరలకే నాణ్యమైన బంగారు ఆభరణాలను అందిస్తున్న లలిత జ్యువెలరీ అందిస్తుందని లలిత జ్యువెలరీ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్. ఎస్.కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం కర్నూలు నగరంలో 51వ షోరూంను పార్క్ రోడ్డు లోని మేడం కాంపౌండ్‌లో అట్టహాసంగా ప్రారంభించింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో లలిత జ్యువెలరీ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్, రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, ఎమ్మెల్యేలు అబ్దుల్ హాఫీజ్ ఖాన్, కాటసాని రాంభూపాల్ రెడ్డి, నగర మేయర్ బి వై రామయ్య, డిప్యూటీ మేయర్లు ఎస్.రేణుక, ఎన్.అరుణ, 13వ కార్పొరేటర్ ఎం.విజయలక్ష్మిలు పాల్గొన్నారు.దక్షిణ భారతదేశంలో అగ్రగామిగా గుర్తింపు తెచ్చుకున్న లలిత జ్యువెలరీ 51వ షోరూంను కర్నూలులో ప్రారంభించడం ఆనందంగా ఉందని లలిత జ్యువెలరీ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ కిరణ్ కుమార్ అన్నారు. తయారీ ధరకే బంగారం, వజ్రాభరణాలు అందిస్తున్నామన్నారు. ప్రజలు పెద్ద మొత్తంలో తమ కష్టార్జితాన్ని ఆదా చేయవచ్చని, మార్కెట్లోనే ఇతర షోరూంలో లభించని సరికొత్త బంగారు నగల కొనుగోలు పథకంను అందిస్తున్నామన్నారు. ఇప్పటికే తెలుగు రాష్ట్రాలలో పలు ప్రాంతాలలో లలిత జ్యువెలరీ విశేష ఆదరణ పొందిందని, అన్ని ప్రాంతాల వారికి తక్కువ తరుగు తక్కువధరలో నగలు ఇవ్వాలనే ఉద్దేశంతో వినియోగదారుల ఆశీస్సులతో మాషోరూమ్ కర్నూలులో ప్రారంభించామన్నారు. కర్నూలు మరియు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఎక్కువ స్థాయిలో ప్రజలు మా ఇతర షోరూమ్ లకు వచ్చి నగలు కొనడం గమనించామని, అందుకే ఇక్కడ కొత్త షోరూమ్‌ను ప్రారంభించామని ఆయన వెల్లడించారు.

వినియోగదారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని లలిత జ్యువెలరీ సరికొత్త ధనవందనం 11 నెలల నగలు కొనుగోలు పథ కాన్ని ప్రారంభించిందన్నారు. ఇందులో నెల నెల కట్టే డబ్బు బంగారం గానూ లేక డబ్బు గాను ఆదా చేసుకునే వీలుందన్నారు. ఏనగ అయినప్పటికీ 50% తరుగు లేదని, అలాగే ఒక నెల ఇన్‌స్టాల్మెంట్‌లో 50% బోనస్ కలదన్నారు. విస్తృతమైన కలెక్షన్లు మా ప్రత్యేకతలన్నారు. చెయిన్, గాజులు, నెక్లెస్, చోకర్స్, హారం, వంకి,ఒడ్డాణం, ఉంగ రాలు, కమ్మ లు, జుమ్మిలతోపాటు పలు రకాల నగలు లక్షలాది సంఖ్యలో మా కొత్త షోరూమ్‌లో ఉన్నాయన్నారు. తను చాలా పేద కుటుంబంలో జన్మించానని, సాధారణ వ్యక్తికి సరైన ధరలో నగలు కొనడం అనేది ఓపెద్ద ఛాలెంజ్ అన్న విషయం నాకు తెలుసు అన్నారు. నగల రంగంలో ఉచితాలు, బహుమతు లు, డిస్కౌంట్‌ల పేర్లతో కస్టమర్లను కన్ఫ్యూజ్ చేస్తుంటారని, ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బు విలువ నాకు బాగా తెలుసు కనుకనే కస్టమర్లకు నేను అవగాహన కల్పిస్తుంటానని ఈసందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ వెల్లడించారు.

లోకేష్ పాదయాత్ర వల్లే వర్షం ఆగిపోయింది

విశాలాంధ్ర – హొలగుంద : మండలంలోని కోగిలతోటలో శనివారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం జరిగింది రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాంకు ఆలూరు వైసీపీ ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి, నాయకులు, కార్యకర్తలు గజమాలతో స్వాగతం పలికారు. మంత్రి ముందుగా గాదలింగేశ్వర స్వామి మారెమ్మలను దర్శించుకున్నారు అనంతరం గడపగడప కార్యక్రమంలో ఇంటింటా తిరిగి సంక్షేమ పథకాలు అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించారు ఈసందర్భంగా మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రతోనే వర్షం ఆగిపోయిందని, మళ్లీ చంద్రబాబు వస్తే కరువు కాటకాలు మొదలవుతాయని కామపిడప్రాంతాలుగా రాష్ట్రం ఏర్పడుతుందని విమర్శించారు.కరుడుగట్టిన టీడీపీ నాయకుల కుటుంబాలకు కూడా జగనన్న చేపట్టిన సంక్షేమ పథకాలు నేరుగా అందాయని అన్నారు.కార్యక్రమంలో ఆలూరు వైకాపా ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి సర్పంచ్ గురుపాదమ్మ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు కురువ బుజ్జమ్మ, వైసీపీ మండల కన్వీనర్ షఫీ ఉల్లా, ఎంపీపీ తనయుడు ఈసా, నాయకులు సత్యనారాయణ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, లక్ష్మికాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గిరి వెంకటేష్, శేషప్ప, నాగప్ప, హనుమప్ప, సింగల్ విండో చైర్మన్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం

విశాలాంధ్ర : కోడుమూరు : స్థానిక రాజు ఫోటో స్టూడియోలో ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రాఫర్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో ముందుగా ఫోటోగ్రాఫర్ సృష్టికర్త దాగూరే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.అనంతరం వారు కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ నాయకులు జక్కన్న ఆచారి మాట్లాడుతూ భవిష్యత్తులో ఫోటో, వీడియో గ్రాఫర్స్ కార్మికులను ప్రభుత్వాలు ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.కొందరు అప్పుడున్న టెక్నాలజీని ఉపయోగిస్తూనే మారుతున్న టెక్నాలజీ యుగంలోకి మారాలంటే ఫోటోగ్రాఫర్లు మరింత పెట్టుబడి పెట్టడానికి అవస్థలు పడుతున్నారన్నారు. ఫోటోగ్రాఫర్స్ కష్టాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఫోటోగ్రాఫర్స్ కూడా సంక్షేమ పథకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్లు కలాం, నరసప్ప, నబి, నాగేష్, లాలు,మన్సూర్ భాష,అంజి,హనుమన్న,వినోద్ తదితరులు పాల్గొన్నారు.

గైనిక్ సమస్యలపై అవగాహన

విశాలాంధ్ర- కర్నూల్ సిటీ : కర్నూలు నగరంలోని రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాల నందు శనివారం హెల్త్ క్లబ్ " స్వస్థ " ఆధ్వర్యంలో గైనిక్ సమస్యలపై విద్యార్థినీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జెమ్ కేర్ కామినేని హాస్పిటల్ గైనేకోలోజిస్ట్ మరియు లాప్రోస్కోపిక్ సర్జన్ డా. వి.హెచ్. శృతి అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సరైన పోషకాహారం తీసుకోక పోవటం, పని ఒత్తిడి, అలసట, మానసిక సమస్యల కారణంగా ఇటీవల కాలంలో మహిళలు ప్రధానంగా గైనిక్ సమస్యలతో బాధ పడుతున్నారు, స్త్రీలలో వచ్చే గైనిక్ సమస్యలకు ఏఏ సందర్భాల్లో ఎటువంటిటెస్టులు చేయించుకోవాలి, తదితర అంశాలపై విద్యార్థినీలకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినీలు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు.కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.ఈ. శ్రీనివాసమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డా. జె.ఉష్మశ్రీ, వివిధ విభాగాధిపతులు, స్వస్థ కో ఆర్డినేటర్ ఆర్. దీప్తి క్రిస్టిన్ రెబెకా, ఫాకల్టీ పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర – కర్నూలు : ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులుఎస్.శరత్ కుమార్ పిలుపునిచ్చారు.శనివారం బుగ్గరామేశ్వర డిగ్రీ కళాశాలలో నిర్మాణ మహాసభల కరపత్రాలు విడుదల చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని వివిధ రూపాల్లో అనేక పోరాటాలు ఏఐఎస్ఎఫ్ నిర్వహించిందని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయకుండా జాప్యం చేస్తుందని అన్నారు. దీంతో విద్యార్థులు వేలాది రూపాయలు వెచ్చించి బయట కొనాల్సి వస్తుందని, పేద విద్యార్థులకు ఈపరిస్థితి ఆదనపుభారం మోపుతుందని అన్నారు.ఈ కరపత్రాలు విడుదల చేసిన వారిలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు నవదీప్,వినయ్,రాము,కళ్యాణ్, బాబు, హరి తదితరులు ఉన్నారు.

పత్తికొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అల్తాఫ్, మండల కార్యదర్శి నజీర్‌లు డిమాండ్ చేశారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో చేపట్టిన నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని, కళాశాలలో నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక:

ఏఐఎస్ఎఫ్ జూనియర్ కళాశాల నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. కళాశాల అధ్యక్షులుగా విగ్నేష్, ఉపాధ్యక్షులుగా ఆకాష్, ఇర్ఫాన్, కుమార్, కార్యదర్శిగా దేవనాథ్, సహాయ కార్యదర్శులుగా రఘు, ఉపేంద్ర, చరణ్‌తో పాటు మరో 9 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అహమ్మద్, పవన్, సుమన్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని రక్షించుకుందాం..

విశాలాంధ్ర-పెద్దకడబూరు : దేశాన్ని కాపాడాలని, రాష్ట్రాన్ని రక్షించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్ కోరారు. శనివారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని స్థానిక సీపీఐ కార్యాలయంలో సీపీఐ మండల కార్యదర్శి వీరేష్ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 17 నుండి సెప్టెంబర్ 8 వరకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సహా 40 మందితో రాష్ట్ర అభివృద్ధి, ప్రత్యేక హెూదా, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల కొరకు బస్సు యాత్ర చేపట్టినట్లు తెలిపారు. గుండ్రేవుల, ఆర్డీఎస్ కుడికాలువ ప్రాజెక్టు నిర్మాణంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. బస్సు యాత్ర పెద్దకడబూరు మండలానికి సెప్టెంబర్ 2వ చేరుకుంటుందని, బస్సు యాత్రకు ఘనంగా స్వాగతం పలికి జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు జాఫర్ పటేల్, నాయకులు రెక్కల గిడ్డయ్య, తిక్కన్న, నర్సింహులు, డోలు హనుమంతు వీరాంజినేయులు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు యువతను కాపాడండి

విశాలాంధ్ర- పత్తికొండ : మత్తు పదార్థాల నుండి యువతను కాపాడాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ క్రాంతినాయుడు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండలో మత్తు పదార్థాలను అరికట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. దాబాలు, బెల్టుషాపులు, కూల్ డ్రింక్‌షాప్‌ల్లో నాటుసారా, గంజాయివంటి మత్తుపదార్థాలను విచ్చలవిడిగా అమ్ముతున్న పట్టించుకోవడం లేదన్నారు. యువతవాటికి బానిసలుగా మారి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మత్తు పదార్థాలను అరికట్టి యువత ప్రాణాలను కాపాడాలన్నారు.

డివిజన్ మీటర్ రీడర్స్ కార్మికులు ఏఐటీయూసీలో చేరిక

విశాలాంధ్ర – ఎమ్మిగనూరు: విద్యుత్ మీటర్ రీడర్స్ కు ఉద్యోగ భద్రత కల్పిస్తూ, నెలవారీ వేతనం ఇవ్వాలని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ ఎస్పీడీసీఎల్, ఇపిడిసిఎల్, సీపీడీసీఎల్ పరిధిలో సుమారు 4,500 మీటర్ రీడర్లు 10 నుండి 25 సం!! పైగా సంస్థ నమ్ముకొని పనిచేస్తున్నారనీ అలాంటి మీటర్ రీడర్లకు కనీస వేతనం కల్పించి సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్ మునెప్ప తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదోని డివిజన్ విద్యుత్ మీటర్ రీడర్స్ ముఖ్య కార్మికులు 20 మంది ఏఐటీయూసీలో చేరారు. ఈసందర్భంగా మునెప్ప మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు వస్తున్న నేపథ్యంలో మీటర్ రీడర్స్ ఉపాధికి ప్రమాదం ఏర్పడిందని ఏళ్ల తరబడి సంస్థని నమ్ముకుని పనిచేస్తున్న మీటర్ రీడర్లకు సంస్థలోనే ప్రభుత్వం స్పందించి ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని వారు తెలిపారు. మీటర్ల రీడర్లు వీరిలో ఐటిఐ అర్హత కలిగిన వారు కూడా ఉన్నారు వారికి షిఫ్ట్ ఆపరేటర్లుగాను వాచ్ టు వార్డు గాను నియమించి, నాన్ టెక్నికల్ అర్హత కలిగిన వారిని కొత్తగా ఏర్పడు తున్నటువంటి ఆఫీసులో వాచ్మెన్, ఆఫీస్ బాయ్స్ గానూ సంస్థలోని ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాజమాన్యం నిర్ణయించిన పీస్ రేటును జిల్లాల్లోని కాంట్రాక్టర్లు సక్రమంగా అమలుచేయడం లేదనీ మీటర్ రీడర్స్‌కు పనిదినాలు తగ్గించటంతో వేతనాలు తగ్గి కుటుంబాల జీవనం మరింత కష్టతరంగా మారిందని తెలిపారు. సమాజంలో నిత్యవసర వస్తువులు రేట్లు విపరీతంగా పెరుగుతున్నాయి కానీ మీటర్ రీడర్స్ జీతాలు పెరగకపోగా జీతాలు తగ్గిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గడువులోపు బిల్లింగ్ పూర్తి చేయడానికి పరుగులు పెడుతూ మానసిక ఒత్తిడులకు గురవుతున్నారు. మీటర్ రీడర్లలో చాలా మంది బిల్లింగ్ కూడా 15 రోజుల చేయవలసిన పనిని కాంట్రాక్టర్ 10 రోజులకే బిల్లింగ్ పూర్తి చేయిస్తున్నారన్నారు. దీర్ఘకాలంగా సంస్థను నమ్ముకుని చాలిచాలని వేతనంతో జీవనం గడుపు తున్న మీటర్ల రీడర్లు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సంస్థ లోనే ఉద్యోగాలు కల్పించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున వారితో కలిసి పోరాటాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

మీటర్ రీడర్స్ ఏఐటీయూసీ యూనియన్ కమిటీ ఎన్నిక

అధ్యక్షులుగా కె.వీరేష్ ఉపాధ్యక్షులు చిన్నఉరుకుంద, కార్యదర్శి డి.నరసింహారెడ్డి సహాయ కార్యదర్శులు: కిరణ్, రంగన్న, కోశాధికారి కే దశరథ్‌లతో పాటు 13 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమంలో ఏఐటీయూసీ తాలూకా అధ్యక్ష కార్యదర్శులు వీరేశు,తిమ్మా గురుడు, విజయేంద్ర, సీపీఐ నాయకులు రంగన్న,పంపన్న గౌడ్, పాల్గొన్నారు.

చెల్లని ఓటుపై టీడీపీ అభ్యంతరం

విశాలాంధ్ర-పెద్దకడబూరు: మండల పరిధిలోని కల్లుకుంట, గంగులపాడు గ్రామాల్లో రెండు వార్డు మెంబర్లకు శనివారం జరిగిన ఉప ఎన్నికల్లో వైసీపీ హవా కొనసాగింది. కల్లుకుంట గ్రామంలో 11వవార్డు మెంబర్‌కు జరిగిన ఉపఎన్నికల్లో 224 ఓట్లు, గంగులపాడులో 5వ వార్డుకు జరిగిన ఉపఎన్నికల్లో 145 ఓట్లు పోలయ్యాయి. కల్లుకుంటలో 11వ వార్డు మెంబర్‌గా వైసీపీ బలపరచిన అభ్యర్థి సుజాత 22 ఓట్ల మెజార్టీతో సమీప టీడీపీ అభ్యర్థి మాణిక్యమ్మపై విజయం సాధించారు. సుజాతకు 112 ఓట్లు రాగా, మాణిక్యమ్మకు 90 ఓట్లు, సీపీఎం బలపరచిన రాణెమ్మకు 13 ఓట్లు వచ్చాయి. గంగులపాడు లో వైసీపీ, టీడీపీ అభ్యర్థుల మధ్య నువ్వా నేనా అన్నట్లు జరిగిన హెూరాహెూరి పోటీలో వైసీపీ అభ్యర్థి ముంతాజ్ ఒక్క ఓటుతో సమీప టీడీపీ అభ్యర్థి లక్ష్మిపై విజయం సాధించారు. ముంతాజ్‌కు 72 ఓట్లు రాగా, లక్ష్మికి 71 ఓట్లు వచ్చాయి. దీంతో స్టేజ్-2 అధికారిణి సువర్ణల సునియం ముంతాజ్ 5వ వార్డు మెంబర్‌గా విజయం సాధించినట్లు ధృవీకరణ పత్రం అందజేశారు. అందుకు ముందు టీడీపీ లీగల్ సెల్ తాలూకా అధ్యక్షులుబాబురావు, టీడీపీ నాయకులు సోమన్న రాఘవేంద్ర స్వామి, హనుమేష్ స్వామి, సోమన్న, అంపయ్య తదితరులు రీ కౌంటింగ్ చేయాలని కౌంటింగ్ కేంద్రం వద్ద ఎస్ఐ మహేష్ కుమార్‌తో వాగ్వివాదానికి దిగారు. చెల్లని ఓటుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. చెల్లని ఓటు టీడీపీ బలపరచిన లక్ష్మీదేవి దేనని వాదించారు. స్టేజ్ - 2 అధికారిణి సువర్ణల సునియం టీడీపీ నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ చెల్లని ఓటును ప్రెస్‌కు విడుదల చేశారు. అవసరమైతే చెల్లని ఓటుపై అప్పీల్‌కు వెళుతామని టీడీపీ లీగల్ సెల్ తాలూకా అధ్యక్షులు బాబురావు స్పష్టం చేశారు.

వెల్దుర్తి రూరల్ : మండల పరిధిలోని బొమ్మిరెడ్డి పల్లె గ్రామంలో శనివారంవార్డు ఉపఎన్నిక జరిగింది. మొత్తం ఓట్లు 139 లో పోలైన ఓట్లలో 122 గాను టిడిపికి 65 , వైసీపీకి 53, నోటాకు 4రాగా, టీడీపీ అభ్యర్థి కోదండపాణి 12 ఓట్లతో విజయం సాధించారు. రిటర్నింగ్ అధికారులు డిక్లరేషన్ ఫామ్ అందజేశారు గ్రామంలో గ్రామ నాయకుడు సుబ్బారాయుడు తోపాటు టీడీపీ కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు.డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి,సీఐ యుగేందర్ ,ఎస్సై సురేష్, పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.అలాగే లక్ష్మీనగరం వార్డు ఉప ఎన్నిక లో 244 ఓట్లకుగాను 197 పోలవ్వగా వైసీపీ కి 150, టీడీపీకి 42, చెల్లనివి 4, నోటాకు1గా నమోదయ్యా యి. వైసీపీ అభ్యర్థి నక్కలోకేష్ 108 ఓట్లతో గెలుపొందారు. అభ్యర్థికి రిటర్నింగ్ అధికారి డిక్లరేషన్ ఫామ్ అందజేశారు.

ప్యాపిలి : మండల కేంద్రమైన ప్యాపిలిలోని రెండో వార్డు మెంబరు స్థానానికి జరిగిన ఉప ఎన్నికలలో టీడీపీ అభ్యర్థి నడిగడ్డ హారతి విజయం సాధించారు. వైసీపీ అభ్యర్థి జక్కు వెంకట లక్ష్మి పై టీడీపీ అభ్యర్థి హారతి 19 ఓట్ల మెజార్టీని సాధించారు. ఈ వార్డు స్థానంలో మొత్తం 614 ఓట్లు ఉండగా 463 ఓట్లు పోలయ్యాయి. అందులో టీడీపీ అభ్యర్థికి 235, వైసీపీ అభ్యర్థికి 216, చెల్లనివి 10, నోటాకు ఒక ఓటు పోలయ్యాయి. టీడీపీ అభ్యర్థి విజయకేతనం ఎగరవేయడం వలన టీడీపీలో సంబరాలు అంబరాన్నంటాయి.

దేవనకొండ : మండల పరిధిలోని పి.కోటకొండ 1వ వార్డు, కుంకనూరు 8వ వార్డులకు వార్డు మెంబరు ఎన్నిక నిర్వహించగా 2 ఏకగ్రీవమయ్యాయి.పి.కోటకొండ వార్డు మెంబరు గా ఇండిపెండెంట్ అభ్యర్థి మునగాల జయసుధ, కుంకనూరు8వ వార్డు గిత్త.వెంకటలక్ష్మి లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయా గ్రామాలపంచాయతీ కార్యదర్శులు తెలిపారు.

ఆదోని రూరల్ : మండలంలోని పెద్దతుంబలం 14వ వార్డుకు ఉన్నందునబరిలో వైసీపీ,టీడీపీ, జనసేన పార్టీ బలపరిచిన అభ్యర్థులు బరిలో నిలిచారు. వైసీపీ బలపరిచిన వార్డు నెంబర్, వైసిపి కార్యకర్తలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఎన్నికల నిబంధనల ప్రకారం నామినేషన్ దాఖలు చేయకపోవడంతో తిరస్కరణకు గురైంది. శనివారం జరిగిన ఎన్నికల బరిలో మాత్రం టీడీపీ బలపరిచిన అభ్యర్థి జంగల్ ఆంజనయ్యా, జనసేన బలపరిచిన అభ్యర్థి సన్నక్కి రాజులకు ఉప ఎన్నికలు పోటాపోటీగా జరిగాయి. ఎన్నికలో టీడీపీ మద్దతుదారుడు జంగమ ఆంజనయ్య గెలుపొందారు.

హొలగుంద : మండలంలోని చిన్న హైట 9వ వార్డుకు ఉప ఎన్నిక శనివారం జరిగాయి. ఈవార్డు మెంబరుగా పోటీ చేసిన సిహెచ్.మంగమ్మకు 75 ఓట్లురాగా తన సమీప ప్రత్యర్థి హెచ్.ఈరమ్మకు 66 ఓట్లు పోలవడంతో మంగమ్మ తొమ్మిది ఓట్లు అధిక మెజార్టీని సాధించి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి జగన్నాథం తెలిపారు. 7ఓట్లు చెల్లనివిగా గుర్తించామని అన్నారు. మడ్డి లింగాల హళ్లిలోని మూడో వార్డుకు ఎన్నికలు జరిగాయి. బసవన్న గౌడ్ గారి గోపాలమ్మ తన సమీప ప్రతాప్ మరియమ్మపై 16 ఓట్లతో గెలుపొందారు.

కౌతాళం: మండలంలో శనివారం పోటాపోటీగా జరిగిన బదిని హాల్ గ్రామ సర్పంచ్ ఉప ఎన్నికల్లో వైసీపీ మద్దతుదారుడు మాల నరసప్ప ఘన విజయం సాధించాడు. శనివారం జరిగిన పోలింగ్లో అధికారులు మొత్తం ఆరు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు మొత్తం గ్రామంలో 3137 మంది ఓటర్లు ఉన్నారు వైకాపా దారుడుగా నర్సప్ప, టిడిపి మద్దతుదారుడుగా వీరేష్ సర్పంచి ఎన్నికల్లో పోటీ చేశారు.

పంటల నమోదు తప్పనిసరి

విశాలాంధ్ర -సి.బెళగల్ : ప్రతి రైతు వేసిన పంటలను ఈ క్రాప్ బుకింగ్ మరియు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి జి.మల్లేష్ కుమార్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని ఈర్లదిన్నె, కొత్తకోట గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2023 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈక్రాప్ బుకింగ్, పంటనమోదు ప్రతి రైతు తప్పక చేయించు కోవాల్సిందిగా ఆయన సూచించారు. అనంతరం రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఎవరైనా రైతులు ఎరువులు కావాల్సిన వారు తమ రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

పేదింట్లో విద్యా కుసుమం..

విశాలాంధ్ర- ఆదోని : తన తండ్రి పడే కష్టాన్ని కళ్లారా చూసుంది...తల్లి ఆశయాన్ని నిజం చేయాలని కంకణం కట్టుకొని నీట్ ఆల్ ఇండియాలో 69757ర్యాంక్ సాధించి 543 మార్కులతో ఎంబీబీఎస్ సీట్ సంపాదించిన పేద కుటుంబానికి చెందిన ఆటోవాలా కూతురు షమీనా చదువుకు డబ్బు అవసరం లేదని నిరూపించింది. తండ్రి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. తల్లి హాజరాబీ కూలీ పనిచేస్తు ఎంత కష్టమైన నా పిల్లలకు మంచి భవిష్యత్తును అందించాలన్న లక్ష్యంతో కష్టపడి చదివిస్తున్నారు. పెద్దకుమార్తె షమీనా నేడు నీట్ ఫలితాల్లో 543 ర్యాంక్‌తో ఎంబీబీఎస్ సీట్ సాధించిందంటే తల్లిదండ్రుల కృషి, ప్రోత్సాహం ఎనలేనిది. మొదటి ప్రయత్నంలోనే సీట్ సంపాదించడంతో షమీనా మామయ్య హాజీవలి, స్నేహితులు, కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి

విశాలాంధ్ర- దేవనకొండ రూరల్ : ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురై 36 గొర్రెలు మృతి చెందిన సంఘటన దేవనకొండ మండలంలోని గద్దెరాళ్ల గ్రామ శివారులో శనివారం చోటుచేసుకుంది. గొర్రెల కాపరులు, స్థానిక రైతులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పల్లె దొడ్డి గ్రామానికి చెందిన వడ్డే లింగన్న, నాగేష్ లకు చెందిన గొర్రెల మంద మేపు కోసం గద్దె రాళ్ల గ్రామ శివారులో హంద్రీనీవా కాలువ గట్టుపై నుండి తోలుకు వెళుతున్నారు. అయితే అక్కడే ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ గుండా వెళ్లిన విద్యుత్తు వైర్లు తెగి కింద పడి ఉన్న విషయాన్ని గమనించక ముందు వెళ్తున్న గొర్రెలుకు విద్యుత్ వైర్లు తగిలి మృతి చెందాయి. గొర్రెలు మృతి గమనించిన గొర్రెల కాపర్లు అక్కడే పొలాల్లో ఉన్న రైతులకు తెలపడంతో విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఆ ట్రాన్స్ఫార్మర్ కు ఉన్న విద్యుత్ సరఫరా బందు చేశారు. బాధిత గొర్రెల పెంపకం దారునికి సుమారు రూ.3.80 లక్షల దాకా నష్టం సంభవించింది. ఆకస్మికంగా జరిగిన సంఘటనతో బాధిత గొర్రెల పెంపకదారుల కుటుంబంలో విషాదఛాయలు అమ్ముకున్నాయి. సమాచారం తెలుసుకున్న పశువైద్యాధికారి వెంకటేష్ ఆధ్వర్యంలో గొర్రెలకు పోస్ట్ మార్టం నిర్వహించారు. బాధిత గొర్రెల యజమాని ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కౌలు రైతులకు రుణాలు ఇప్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : కౌలు రైతులకు రుణాలు ఇప్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి అన్నారు.శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వరరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ .జిల్లాలోని కౌలు రైతులకు రుణాలు ఇప్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రాలను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలియజేశారు. పాణ్యం, కోడుమూరు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సుధాకర్‌బాబులు మాట్లాడుతూ కౌలు రైతులకు రుణాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారిణి వరలక్ష్మి మాట్లాడుతూ వర్షాధార అభివృద్ధి పథకం కింద జిల్లాకు 26 మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు అయ్యాయన్నారు. యూనిట్‌కు 50% సబ్సిడీ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. సమావేశంలో ఏపిఎంఐపి పిడి ఉమాదేవి, మత్స్య శాఖ అధికారి శ్యామల, ఎస్సీ కార్పొరేషన్, మార్కెటింగ్, ఉద్యాన, మార్క్ ఫెడ్ తదితర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ల ఏర్పాటుకు సహకరించాలి

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : ఓర్వకల్లు మండలం గుట్టపాడు గ్రామ పరిధిలో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ విద్యుత్ సరఫరా లైన్‌లు ఏర్పాటు చేయుటకు రైతులు సహకరించాలని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన కోరారు.శనివారం ఓర్వకల్ మండలంలోని కాల్వబుగ్గ గ్రామం నుండి గుమ్మటం తాండ ప్రాజెక్ట్ వరకు 100 అడుగుల రోడ్డు వెడల్పు ఏర్పాటు, గుట్టపాడు గ్రామం నందు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ విద్యుత్ సరఫరా లైన్ ఏర్పాటు కు సంబంధించిన పనులను జిల్లా కలెక్టర్ డా.జి.సృజన, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య లతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రీన్ కో ప్రాజెక్ట్ అధికారులు ముందుగా కాల్వబుగ్గ నుండి గుమ్మటం తాండ ప్రాజెక్ట్ వరకు వేయబోతున్న 100 అడుగుల వెడల్పు రోడ్డుకు సంబందించిన భూ సేకరణ పనులు గురించి కలెక్టర్ గారికి వివరిస్తూ ఈ రోడ్డు మార్గంలో ప్రైవేట్ భూములు, రెవెన్యూ భూములు, అసైన్డ్ భూములు ఉన్నాయని అందులో కొన్ని భూములు రైతుల నుండి కొనుగోలు చేసుకున్నామని తెలిపారు. ఇంకా కొంత భూములు అవసరము ఉన్నదని కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక పద్ధతి ప్రకారం అర్హులైన రైతులకు పరిహారం చెల్లించి సేకరించి అప్పగిస్తామని కలెక్టర్ తెలిపారు.గుట్టపాడు గ్రామ పరిధి భూములలో వెళ్లనున్న పవర్ గ్రిడ్ కార్పొరేషన్ కి చెందిన రెండు లైన్లు, గ్రీన్ కో కి చెందిన రెండు పవర్ లైన్లు ఏర్పాటు కి సంబంధించిన భూ సేకరణ కొరకు పాణ్యం ఎమ్మెల్యే, రైతులు, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, గ్రీన్ కో కంపెనీ వారితో కలిపి జాయింట్ కమిటీ సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ డా.జి.సృజన తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ హరి ప్రసాద్, ఓర్వకల్ తహ శీల్దార్ శివ ప్రసాద్ రెడ్డి, గ్రీన్‌కో అధికారులు తదితరులు పాల్గొన్నారు.